క్లుప్తంగా

ఆధ్యాత్మికత అలవర్చుకోండి



ఇప్పేరులో శివలింగాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

కూడేరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకుని భగవంతున్ని ప్రార్థించాలని స్థానిక ప్రజాపిత బ్రహ్మకుమారీ విశ్వ విద్యాలయ మండల సంచాలకురాలు వేదావతి పిలుపు నిచ్చారు. శనివారం ప్రజాపిత బ్రహ్మ కుమారి విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో మండలంలోని ఇప్పేరులో బాలికలు హారతులు పట్టగా శివలింగాన్ని ఊరేగించారు. ప్రతి ఒక్కరూ దైవభక్తిని అలవర్చుకుని మానసిక ప్రశాంతతను పొందాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంత జీవితం

కంబదూరు: ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే ప్రశాంత జీవితం గడపవచ్చని కంబదూరు, కళ్యాణదుర్గం రూరల్, బ్రహ్మసముద్రం ఎస్‌ఐలు రాజేష్, సుధాకర్, పరశురాముడు, కంబదూరు సర్పంచ్ సాకే గంగాధర్ అన్నారు. శనివారం మహాశివరాత్రిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో ఓం శాంతి జెండాను ఎగురవేసి, గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజలకు ఆధ్యాత్మిక బోధనలు చేశారు.

నేడు ప్రత్యేక పూజలు



అలంకరణలో వేంకటేశ్వర స్వామి

కళ్యాణదుర్గం: స్థానిక ఆర్టీటీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న పద్మావతి గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పూజలతో పాటు శివ పార్వతుల కల్యాణోత్సవం, వేంకటేశ్వరుడి కల్యాణోత్సవం ఒకే రోజు జరపడం ఎంతో విశేషమన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొనేవారు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నేడు రాతి దూలం లాగుడు పోటీలు

కూడేరు: మండల పరిధిలోని మరుట్ల–3వ కాలనీలో ఆదివారం చితంబరేశ్వర స్వామి రథోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి రాతి దూలం లాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు, నిర్వాహకులు శనివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గిరిజమ్మ, ఎంపీ తలారి రంగయ్య హాజరవుతారన్నారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

కోనాపురంలో డెంగీ కేసు నమోదు



ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై ఆరాతీస్తున్న వైద్య బృందం

ఉరవకొండ: మండలంలోని కోనాపురం గ్రామంలో డెంగీ కేసు నమోదవడంతో జిల్లా వైద్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు శనివారం కౌకుంట్ల పీహెచ్‌సీ వైద్య బృందం పర్యటించింది. పీహెచ్‌సీ వైద్యాధికారి అనికేత్ ఆధ్వర్యంలో వైద్య బృందం ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై ఆరా తీశారు. అనంతరం హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరణ డెంగీ బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో గ్రామస్తులకు వివరించారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా రాత్రి సమయాల్లో వేపాకు పొగ వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ ఆఫీసర్ లక్ష్మీనాయక్, ఆరోగ్య పర్యవేక్షకుడు చౌడప్ప, సహాయకుడు నాగరాజు పాల్గొన్నారు.

పద్మశాలీయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజు



రాయదుర్గం: పద్మశాలీయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా రాయదుర్గం పట్టణానికి చెందిన పొరాళ్ల రాజును ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగ్గారపు శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం మంగళగిరిలో జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో పొరాళ్ల రాజును సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించి నియామకపత్రాన్ని అందజేశామన్నారు. రాజు మాట్లాడుతూ పద్మశాలీయుల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు.

శంభో.. శివ శంభో..

- మార్మోగిన శివనామస్మరణ
- వైభవంగా శివరాత్రి వేడుకలు..
- శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు






రాయదుర్గం: అలంకరణలో నీలకంఠేశ్వరుడు, హటకేశ్వరుడు, రాయదుర్గంటౌన్: జంబుకేశ్వరస్వామి, రాయదుర్గం రూరల్: లింగాలబండ పశుపతినాథుడు



బొమ్మనహాళ్: చంద్రగిరిలో 108 శివలింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

రాయదుర్గం/టౌన్/రూరల్: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం మహా శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. వేకువజామునుంచే భక్తులతో శైవ క్షేత్రాలన్నీ శివనామస్మరణతో హోరెత్తాయి. ఆది దంపతులుగా కీర్తి పొందిన శివపార్వతులను దర్శించుకునేందుకు జనం తండోపతండగా తరలివచ్చారు. పట్టణంలోని బళ్లారి రోడ్డులో వెలసిన నీలకంఠేశ్వరుడు, మార్కండేయుడు, జంబుకేశ్వర, హటకేశ్వరస్వామి, చన్నవీరస్వామి, చంద్రమౌళీశ్వరస్వామి, బీటీపీ రోడ్డులోని బసవేశ్వరస్వామి, బెల్లం మల్లప్ప స్వామి, నేతాజీ రోడ్డులోని రామలింగేశ్వరస్వామి, రాజవిద్యాశ్రమంలోని పాదరసలింగం, కోటలో వెలసిన నగరేశ్వరస్వామి ఆలయం, ఓబుళాచారీ రోడ్డునందు వెలసిన రేవణ సిద్దేశ్వరస్వామి ఆలయం శోభాయమానంగా దర్శనమిచ్చాయి. డి హీరేహాళ్ మండలం గవిసిద్దేశ్వర వద్ద ప్రసిద్ధి చెందిన ఉద్భవ లింగం దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆలయాల్లో శివ, పార్వతులకు రుద్రాభిషేకం, కుంకుమార్చన, నైవేద్యం, పూల అంకరణ లాంటి పూజా కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయాల్లో రాత్రంతా భజన, భక్తి గేయాలతో భక్తులు జాగారణ చేపట్టారు. అలాగే మండలంలోని చదం గొల్లలదొడ్డి గ్రామ సమీపంలో లింగాలబండపై వెలసిన పశుపతి నాథుని ఆలయం శనివారం " ఓం నమః శివాయః " పంచాక్షరీ మంత్రంతో మార్మోగింది. 74 ఉడేగోళం మద్దానేశ్వరస్వామి, జుంజురాంపల్లి చిత్రబండపై వెలిసిన ఆరూఢమల్లేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గుమ్మఘట్ట: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలవ్యాప్తంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాలు విద్యుత్ దీపాల అలంకరణలో దేదీప్యమానంగా వెలుగొందాయి.

కణేకల్లు: స్థానిక చిక్కణ్ణేశ్వరస్వామి, స్వయంభేశ్వర స్వామి, సిద్దేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 43ఉడేగోళం గ్రామంలో ఈశ్వరాలయంలో శివరాత్రి వేడుకలు ఘనంగా చేపట్టారు.

బొమ్మనహాళ్: మండల పరిధిలోని బొమ్మనహాళ్, కల్‌హోళ, నేమకల్లు, కురువళ్లి, ఉద్దేహాళ్, శ్రీధరఘట్ట, లింగదహాళ్, గోవిందవాడ , దర్గాహొన్నూరు ఈశ్వర దేవాలయాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నేమకల్లు కొండలో వెలసిన ఈశ్వరుడికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. చంద్రగిరి రామలింగేశ్వర ఆలయంలో 108 శివలింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీధరఘట్ట దత్తాశ్రమం, గోనేహాళ్ కాశీవిశ్వేశ్వరాలయం, గోవిందవాడ ఎణ్ణె రంగనాథేశ్వరాలయం, ఉద్దేహాళ్ శివాలయం భక్తులతో కిటకిటలాడాయి.

భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు

కళ్యాణదుర్గం: శివరాత్రి ఉత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోనిభవానీ శంకరాలయం, శివాలయం, నీలకంఠేశ్వర స్వామి ఆలయం , సిద్ధప్ప వంక వీధి, బావి బసప్ప ఆలయాలతో పాటు పలు గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక కోట వీధిలోని భవానీ శంకరాలయంలో 10.30 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. చిన్నారులు శివ పార్వతుల వేషధారణలో ఆకట్టుకున్నారు.

కంబదూరు: శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో అతి ప్రాచీనమైన మల్లీశ్వర స్వామి ఆలయంలో శనివారం పూజలు వైభవంగా నిర్వహించారు. స్వామిని కళ్యాణదుర్గం ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి, భక్తులు దర్శించుకున్నారు.

శెట్టూరు: శెట్టూరులో చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం, అయ్యగార్లపల్లిలో శివాలయం, ములకలేడు, తిప్పపల్లి శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనుకూరు రామలింగేశ్వర ఆలయంలో భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కుందుర్పి: కుందుర్పిలో ఈశ్వరీయ విద్యాలయల బ్రహ్మకుమారీలు శివలింగాలతో ర్యాలీ చేపట్టారు. తూముకుంట హరిహరేశ్వరస్వామి ఆలయంలో అఖండ భజనలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆదివారం రుద్రంపల్లి మల్లీశ్వరస్వామి రథోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

హరహర మహదేవ శంభోశంకర

ఉరవకొండ: హరహర మహదేవ శంభోశంకర అంటూ భక్తుల నామస్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి. మండలంలోని పెద్దముస్టూరు సిద్దేశ్వర ఆలయంతో పాటు పట్టణంలోని గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, కొండ పై వెలసిన బడేస్వామి ఆలయాల్లో శివరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

జోడు లింగాల ఆలయానికి పోటెత్తిన భక్తులు

కూడేరు: మహా శివరాత్రిని పురస్కరించుకుని దక్షిణ భారత దేశంలోని శివాలయాల్లో ఒక్కటిగా ప్రఖ్యాతి గాంచిన కూడేరలోని శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఇక్కడ వెలసిన స్వయంభు లింగాలను దర్శించుకుంటే మంచి జరుగుతుందని జిల్లా నలుమూలలు, కర్ణాటక నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ ఏపీ వైస్ చాన్సలర్ ఎస్‌ఏ కోరి, బీసీ కార్పొరేషన్ ఈడీ నాగముని, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ జయచంద్రనాయుడు, ఈఓ బి.బాబు తదితరులు స్వామిని దర్శించుకున్నారు. పోనుగంటి ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఎస్‌ఐ సత్యనారాయణలు సిబ్బందితో కలసి బందోబస్తు చర్యలు చేపట్టారు.

వజ్రకరూరు: స్థానిక భోగేశ్వరస్వామి ఆలయం, నగరేశ్వర స్వామి, రామేశ్వరస్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. అలాగే గూళ్య పాళ్యం గ్రామంలోని గురుదేవ ఆశ్రమం, కొనకొండ్ల గ్రామంలోని ఛాయామల్లేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



కళ్యాణదుర్గం: అలంకరణలో భవానీ శంకరుడు



ఉరవకొండ: మల్లీశ్వరస్వామి మూలవిరాట్



ఉరవకొండ: చంద్రమౌళేశ్వరస్వామి మూలవిరాట్



కూడేరు: జోడు లింగాలకు క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

‘ప్రత్యేక హోదా’ కోసం దివ్యాంగుడి సైకిల్‌యాత్ర



సైకిల్‌యాత్రలో ఉరవకొండకు చేరుకున్న ప్రసాద్

ఉరవకొండ: రాష్ట్రానికి ప్రత్యేకహోదాతో పాటు విశాఖపట్నానికి రైల్వే జోన్ కేటాయించాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం బొరుగ్రామ్ గ్రామానికి చెందిన దివ్యాంగుడు నీలప్రసాద్ తన ట్రైసైకిల్‌పై యాత్ర సాగిస్తూ శనివారం ఉరవకొండకు చేరుకున్నాడు. ఆయన మాట్లాడుతూ కేంద్రం రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించి, విశాఖకు రైల్వే జోన్ కేటాయించాలని కోరుతూ 13 జిల్లాల మీదుగా శ్రీకాకుళం నుంచి యాత్ర ప్రారంభించామన్నారు. ఇప్పటికే 12 జిల్లాల్లో 200 మండలాల మీదుగా యాత్ర చేశానన్నారు. ప్రతి మండలంలో అధికారులను కలసి ఒక లెటర్ తీసుకోవడంతో పాటు రాజకీయ నేతలను కలసి మద్దతు కోరుతున్నానన్నారు. మరో ఐదు రోజుల్లో అనంతపురం చేరుకోగానే యాత్ర ముగుస్తుందన్నారు. కేంద్రంలోని పెద్దలు ఇప్పటికైనా రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

21న గృహసారథుల సమావేశం

ఉరవకొండ: స్థానిక దేవాంగ ఫంక్షన్ హల్‌లో ఈ నెల 21న ఉరవకొండ పట్టణ, రూరల్‌కు సంబంధించి గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్ల సమావేశం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ పార్టీ కార్యాలయ ప్రతినిధులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు పట్టణ గృహసారథుల సమావేశం, మధ్యాహ్నం 1 గంటకు రూరల్ గృహసారథుల సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డితో పాటు యువనేత ప్రణయ్ రెడ్డి హజరవుతారన్నారు.

26న హెలికాప్టర్ ద్వారా రథంపై పూలవర్షం

కుందుర్పి: మండలంలోని వడ్డెపాళ్యంలో గుడిబండ ఆంజనేయస్వామి రథోత్సవంలో భాగంగా ఈనెల 26న ఉదయం రథంపై హెలికాప్టర్ ద్వారా పూలవర్షం కురిపిస్తున్నట్లు అర్చకుడు హనుమంతరాయుడు శనివారం తెలిపారు. బెంగళూరుకు చెందిన ఓ భక్తుడు తన మొక్కు తీరడంతో రథంపై హెలికాప్టర్ ద్వారా పూలను చల్లిస్తున్నారన్నారు. ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకూ గుడిబండ ఆంజనేయస్వామి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు.

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని పలు మసీదుల్లో షబ్ ఏ మెరాజ్ గుర్తుగా శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జామీయా చౌక్ మసీదు, టిప్పు మసీదు, మక్కా మసీదు, బిలాల్ మసీదు, దర్గా మసీదు, కుబా మసీదుతోపాటు వివిధ మసీదుల్లో మెరాజ్ రాత్రి ఆచరించారు. శనివారం రాత్రి ఇషా నమాజ్‌కు హాజరై ప్రార్థనలు చేశారు. మసీదు ఇమామ్‌లు మెరాజ్‌రాత్రి విశిష్టతను ముస్లింలకు వివరించారు. ఐదు పూటలా నమాజ్‌తోనే మనిషి జీవితానికి సార్థకత చేకూరుతుందన్నారు. ప్రవక్త అడుగుజాడల్లో నడిచి అల్లా విధేయులుగా ఉండాలని సూచించారు.

తోటల్లో స్టార్టర్లు, కేబుల్ చోరీ

రాయదుర్గంటౌన్: పట్టణ పరిధిలోని నాన్ చెరువు నుంచి గొల్లపల్లికి వెళ్లే రహదారిలోని ఆరు తోటల్లో ఒకే రోజు స్టార్టర్లు, కేబుల్ చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మూడు రోజుల క్రితం చోరీ ఘటన జరిగినట్లు బాధిత రైతులు రామాంజనేయులు, భానుప్రకాష్ తదితరులు తెలిపారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఒక్కో రైతుకు రూ.20 నుంచి 30 వేల దాకా నష్టం వాటిల్లిందన్నారు.

ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో అగ్ని ప్రమాదం

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని పార్వతి నగర్‌లో మల్లికార్జునకు చెందిన డ్రై ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. పాదచారులు బీడీ, సిగరెట్ వంటివి తాగి రోడ్డు పక్కన పడేయడంతో ఎండుగడ్డికి నిప్పు అంటుకుని మంటలు ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌కు వ్యాపించాయి. బాధితుడి సమాచారం మేరకు ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే సుమారు రూ.30 వేలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. అలాగే మండలంలోని మల్లాపురం గ్రామానికి చెందిన వెంకటేశులుకు చెందిన మామిడి తోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఫైర్ సిబ్బంది వెళ్లి మంటలను అదుపు చేశారు. అప్పటికే మామిడి చెట్లకు మంటలు వ్యాపించడంతో సుమారు రూ.50 వేలు నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు.

ఘనంగా మర్రిస్వామి రథోత్సవం



శెట్టూరు: ఎర్రబోరేపల్లిలో మర్రిస్వామి రథోత్సవ దృశ్యం



బ్రహ్మసముద్రం: పూజలందుకుంటున్న రుద్ర లింగేశ్వర స్వామి

శెట్టూరు: మండలంలోని ఎర్రబోరేపల్లి సమీపంలో ఉన్న మర్రిస్వామి కొండపై మర్రిస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఐ యువరాజ్ సిబ్బందితో కలసి శాంతిభద్రతలు పర్యవేక్షించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

రుద్రలింగేశ్వర స్వామి రథోత్సవం

బ్రహ్మసముద్రం: శివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని భైరసముద్రం రుద్రలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం గంగపూజ, పల్లకీ సేవ, విశేష అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

వీరభద్రస్వామి రథోత్సవం ప్రారంభం

వజ్రకరూరు: మండలంలోని తట్రకల్లు గ్రామంలో భద్రకాళి సమేత వీరభద్రస్వామి రథోత్సవ వేడుకలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆదివారం రుద్రాభిషేకం, గంగపూజ, అన్నదానం, తీర్థప్రసాద విని యోగం, సాయంత్రం స్వామివారి ఉచ్చాయ ములాగుట జరుగనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సోమవారం రుద్రాభిషేకం, స్వామి కల్యాణోత్సవం, రథోత్సవం ఉంటుందన్నారు.

జరుట్లలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



అలంకరణలో జరుట్ల రామలింగేశ్వరస్వామి



స్వామికి పానకాలు తీసుకువస్తున్న ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్, అర్చకులు

వజ్రకరూరు: మండలంలోని జరుట్ల రాంపురంలో రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో స్వామికి విశేష పూజలతో పాటు ప్రత్యేక అభిషేకాలు, పంచామృతాభిషేకం, కలశ స్థాపన, నవగ్రహారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామి దర్శనానికి బారులు తీరారు. ఈఓ దేవదాసు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రామాంజనేయులుయాదవ్, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ సిబ్బంది లాలేష్, లోకేష్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. కాగా శనివారం అర్ధరాత్రి 12గంటలకు నిర్వహించిన పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆదివారం సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నామని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్, ఈఓ తెలిపారు. అలాగే బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని వజ్రకరూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి సర్దార్‌వలి మాట్లాడుతూ శిబిరంలో మందులు, మాత్రలు సిద్ధంగా ఉంచామన్నారు. సీహెచ్‌ఓ గంగాధర్, సూపర్‌వైజర్ గురుప్రసాద్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం



రామేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం

బెళుగుప్ప: స్థానిక రామేశ్వరాలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని శనివారం కనులపండువగా నిర్వహించారు. అనంతరం పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రికి మరకతలింగస్వామికి లింగోద్భవ అభిషేకాలు, ఏకదశవార రుద్రాభిషేకం నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా మంజునాథ దేవాలయం, విరుపాక్షేశ్వరస్వామి మఠం, బూదిగుమ్మ సిద్దేశ్వరాలయం, తగ్గుపర్తి ఉమామహేశ్వరాలయం, నక్కలపల్లి, రామసాగరం, దుద్దేకుంట, శీర్పి, ఎర్రగుడి, గంగవరం, విరుపాపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు.

జనన ధ్రువీకరణ పత్రాలు అందజేస్తాం

గుమ్మఘట్ట: ప్రభుత్వాస్పత్రిలో కాన్పు అయిన పిల్లలందరికీ జనన ధ్రువీకరణ పత్రం అందజేస్తామని పీహెచ్‌సీ వైద్యుడు రమేష్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మురళీధర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. 2016 మే నుంచి ఇప్పటివరకూ మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో కాన్పు అయి, అనివార్య కారణాల వల్ల ఆన్‌లైన్‌లో బర్త్ సర్టిఫికెట్లు అందని పిల్లలకు ఈ నెల 28 లోపు బర్త్ సర్టిఫికెట్లు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక అవకాశం కల్పించిందన్నారు. పుట్టినతేదీ వివరాలు, తల్లిదండ్రుల ఆధార్‌కార్డులు తప్పకుండా తీసుకురావాలని వారు సూచించారు. అర్హులైనవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

టీడీపీ నాయకుల బరితెగింపు



అక్రమంగా కొళాయి తవ్వకం పనులు చేపడుతున్న టీడీపీ నాయకులు

రాయదుర్గం: మండలంలోని చదం గ్రామంలో టీడీపీ నాయకులు బరితెగిస్తున్నారు. రోజు రోజుకూ వారి ఆగడాలు మితిమీరి పోతుండడంతో గ్రామస్తులు విసిగి వేసారి పోతున్నారు. ఏమాత్రం అడ్డుచెప్పినా, అంతు చూస్తామంటూ..? దాడులకు తెగబడుతూ భయంభ్రాంతులకు గురిచేస్తున్నారు. గ్రామంలో ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలే ఇందుకు నిదర్శనం. టీడీపీ నాయకుడు ఎర్రిస్వామిరెడ్డి ఇంటి వద్ద రహదారికి ఆనుకుని ఉన్న కంపచెట్లను తొలగించాలని, లేకపోతే పక్కనే ఉన్న బావిలోపడి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందంటూ సర్పంచ్ హరిజన వెంకటేశులు, ఈఓపీఆర్‌డీ రఘురాం, కార్యదర్శి బసవరాజు, సచివాలయ ఉద్యోగి భారతి రెండు నెలల క్రితం సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. నువ్వా.. మాకు చెప్పేది అంటూ అధికారుల సమక్షంలోనే దళిత సర్పంచ్ వెంకటేశులుపై ఎర్రిస్వామిరెడ్డి, ఆనందరెడ్డి, భీమరెడ్డి, దేవేంద్రరెడ్డి, మోహన్‌రెడ్డి విక్షణ కోల్పోయి దాడికి తెగబడ్డారు. ఈ ఘటనపై అధికారులు, సర్పంచ్ విడివిడిగా అర్బన్ పీఎస్ లో ఫిర్యాదు చేయడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అధికారులనే సాక్షులుగా చేర్చారు. అయినా ఇప్పటి దాకా అరెస్టు చూపడంలో పోలీసులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. వారి తీరుపై సర్పంచ్‌తో పాటు స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాన పైప్‌లైన్‌కు అక్రమ కనెక్షన్లు..

గ్రామంలోని ఓసీ కాలనీలో తాగునీటి ఇబ్బందుల దృష్ట్యా పంచాయతీ నిధులతో ఓహెచ్‌ఆర్ ట్యాంకు నుంచి పైప్ పనులు చేపట్టారు. ఈ ప్రధాన పైప్‌లైన్‌కు టీడీపీ నాయకులు భీమరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రవిప్రసాద్‌రెడ్డి వారి నివాసాల వద్ద రంధ్రాలు ఏర్పాటు చేసి అక్రమంగా కొళాయి కనెన్షన్లు తవ్వడంతో, నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతాయని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీలో ఎలాంటి అనుమతులు పొందకుండా దౌర్జన్యంగా దళిత సర్పంచ్ అనే భావనతో అక్రమంగా కొళాయి కనెక్షన్లు తవ్వుకుంటున్నారని ఆయన వాపోయారు. వారి ఆగడాలను తాను అడ్డుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని ఆయన కోరారు. ఇదిలా ఉండగా టీడీపీ నాయకులు కొందరు తరచూ ఏదో ఓ కారణంగా వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్ చేయడం, గొడవలు సృష్టించడం దాడులకు ప్రేరేపించడం లాంటి ఘటనలు తరచూ సంభవిస్తునే ఉన్నా పోలీసులు మాత్రం పట్టిపట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.